

కథ

# కాగితం పడవలు

నవులూరి వెంకటేశ్వరరావు

పెంకులురాలే ఇంటి ముందు, పడుకోటానికి వాటిసుఖ సౌకర్యానికి అనుగుణంగా కుక్కలు చేసుకున్న గోతిలో నీటిమీద ప్రదక్షిణ చేస్తోంది. దానిచుట్టు అది గోవిందు చేసి వేసిన రెండు పడవల్లో ఒకటి. రెండోది ఒడ్డుకు చేరి అలసట తీర్చుకుంటోంది.

ఆగి ఆగి ముంచుకొస్తూ కురిసింది కొంతవరకూ ఏడుపు వర్షం. ఈ సారి ఉప్పెనలా కాక కుమిలి కుమిలి ఏడుస్తూంది. విసుగు వేసిన వాళ్ళకు సమాధానం ఇస్తున్నట్లుగా కూడా వుంది. "కురవటం నా జన్మ హక్కు, నీకుగాక నాకు విసుగని పించినపుడు మాత్రమే ఆగుతా". అది ఆగిపోవాలని గోవిందూ కోరటం లేదు. కురవాలనీ కోరటం లేదేమో. మన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా, మన ప్రమేయంతో జీవితం సాగదు అని తెలుసుకోవటం వలన కాదు. అయిదేళ్ళు తెలుసుకో కలిగిన వయసని ఎవరనగలరు? పైగా, జీవిత సుభవాల కొలుముల గుండా పయనం ఇపుడే కదా ఆరంభమయింది.

మునుపయితే - ఆగకుండా అలా కురుస్తూనే వుంటుంటే గుంటలో నీరు ఎప్పుడూ వుంటుంది. ఎప్పుడూ పడవలు వేసి ఆడుకోవచ్చు ; పైపెచ్చు అధికపు వర్షానికి బడి చెరసాలకు శలవు - అని నిస్సంకోచంగా భావించి వుండేవాడు.

గాజుచూపు బల్లేన్ని పడవకు గుచ్చివుంచి ఇంట్లోనించి వచ్చే బెక్కుళ్ళకు చెవులు అప్పగించాడు. అవి వింతగా, విచిత్రంగా వున్నాయి. ఎప్పుడూ ఏడవని వ్యక్తి - ఆ వ్యక్తి ఏడవటం జరుగుతుంది అన్న విషయమే తట్టలేదు - పెట్టేవికాబట్టి. అరగంట నించి, వినవస్తూనే వున్నాయవి, పీలు చిక్కినవెంటనే మొదలయింది లగాయతు. ఏడవకుండా వుండగలిగే శక్తి లేకపోయినా, పీలు చిక్కేంత వరకు దాన్ని వాయిదా వేయగలిగిన శక్తన్నావుంది కనీసం. సంతోషం!

ఇల్లంతా ఖాళీగా వుంది, కొత్తగానూ వుంది. పడవ తన చుట్టు తను తిరగటమనే సంకుచితత్వాన్ని మానుకుని గుంట చుట్టూ తిరుగుతోంది జ్ఞానోదయమయి. గోవిందు తనచేతులతో తనే చేసినవవని. అయితే వాటి గమనం మీద, భద్రతమీద అదుపు వాటిని చేసిన ఆ చేతులకూ లేదు. సిరాతో రాసిన రాతంతా నీటిలో కరిగి పోతోంది. కాయితంతో వున్న క్షణికానుబంధాన్ని తెంచుకుని ఆకాశం కేసి చూశాడు ఇంత నీరు అక్కడ ఎలా దాగివుందా అని. చావులా అదృశ్యంగా వుంది. ఆకాశం నీలంగా, మబ్బుల చిరుగులోనించి క్షణం పాటు తొంగి చూసింది వున్నానంటు. భూమి వెళ్ళిపోయినట్లుంది, మాయమయి పోయినట్లుంది. ఇళ్ళన్నీ నీటిమీద తేలుతున్నట్లున్నాయి.

నీళ్ళు నిండిన తులసికోట. ఈమధ్య నీళ్ళరుగక ఎండుమొహం పట్టిన చెట్టు తలమునకలవుతోంది. కొద్ది దినాల క్రితం వేసిన ముగ్గు ఏ మాత్రం మిగిలివుంటే, ఆ కాస్తంతనూ నీటిపాలు చేసుకుని అస్తిత్వాన్ని కోల్పోయింది. ఆకులు తెంపి నోట్లో వేసుకోవటానికి దగ్గిరగా వెళ్ళాడు, తెంపవద్దని కేకలేస్తూ వచ్చిన గొంతుక శాసనానికి కాలం చెల్లింది కాబట్టి. ఆ పనిలో ఆసక్తి కలుగలేదు.

లోపలినించి ముక్కు చీదుతున్న శబ్దం. బెక్కుళ్లు ఆగాయి. వచ్చిన కొద్ది మంది బంధువులు, స్నేహితులు మధ్యాహ్నానికి ఇంటిలోని నిశ్శబ్దాన్ని. వాళ్ళని ఎవరిమానానికి

వాళ్ళను వదిలి వెళ్ళిపొయ్యారు.

రెండు పెద్దపడవలు చేశాడు రావు పేపర్లు రెండిటితో గర్వం కలిగింది. చేయటం వరకూ బాగానేవుంది. దుర్మార్గం తెలియని,మోసం తెలియని, మాయామర్మాలెరుగని, కేవలం సృష్టించటమే తెలిసిన ఆ చేతులకూ ఆ పడవలపై అదుపు లేదు. వాటి పై వాటికీ లేదు.

చెవులు విదిలించుకుని, తోక ఆడించుకుంటూ - అకారణమైందా సకారణ మైనదా ఆ ఆనందం - ఆకాశంవైపు చూసింది కుక్క, పైవాడిచ్చిన గజ్జికి కృతజ్ఞతా సూచకంగానో, మరోకారణంవల్లో బాధలో సౌఖ్యం వెతుక్కో చూస్తోంది గోక్కుంటూ.

ఖాళీ ఇంట్లోంచి మంచం లాగిన చప్పుడు వినిపించింది. తలతిప్పి ఇంట్లోకి చూసి పడవకు. జీవితంలో ఆ పడవే సర్వస్వం అన్నట్లు, క్షణం దృష్టిమళ్ళిస్తే దాన్ని ఎవరో వారించేట్లు - సర్వస్వం అనుకున్నది ప్రియాతిప్రియం అనుకున్నది వారింపబడి వుండిన అనుభవంవల్ల. అది సందిగ్ధంగా ఆగిపొయ్యింది, తనచుట్టూ తను తిరగాలా, గోతిచుట్టూ తిరగాలా, ఆగి ఊరుకోవాలా అన్న విషయం తేల్చుకోలేక. బుగ్గలనిండా గాలిపట్టి ఊదాడు పడవను కదిల్చటానికి. తన కదలిక పాపానికి తన బాధ్యతలేదని ఎవరినో ఉద్దేశించి మౌనంగా ప్రకటించి, అంతేమౌనంగా కదిలింది. నీటిమీద తేలక, తేలుతూ కదలక పోతేనీ ఉనికికి అర్థం ఏమిటని వాడు ప్రశ్నించలేదు.

"వానలో తడవక, జబ్బుచేస్తుంది!" సన్నటి గొంతుక వేసే కేక జ్ఞాపకపు పొర చీలుస్తూ వినిపిస్తోంది. గతించిన వర్తమానపు కేక. "పనికొచ్చే కాయితాలు చింపేస్తున్నావా?" --డిటో. ఈ క్షణాన స్వేచ్ఛ, ఆంక్షలు గతించి.

ఇంట్లోనించి చేతికి దొరికిన రెండు పెద్ద కాయితాలు తీసుకుని జంటపడవలు చేశాడు. అయితే తన సృష్టిలోని వెలితి వెక్కిరిస్తోంది. ఆ వెలితి ఏమిటో తెలీదు.

వరండాలో తగిలించిన క్యాలెండరు గోడను గాయపరుస్తూ ఏడుస్తోంది. ఏడవక ఏం చేసేట్లు? వీచేగాలిని ఆపగలదా, గోడను గాయపరచకుండా వుండగలదా, అలాగని ఏడవకుండా వుండగలదా? గాలిమాత్రం చేయగలిగిందేముంది, వీచటం మాత్రమే తెలుసు ఎవరెట్లా పోయినా. వర్షపు నీరు చూరునించి కారుతోంది. వరండాలో పొర్లుతున్న చీరను చూశాడు. అలమరలోనించి గాలికి పడిపోయ్యుంటుంది. పడవలను వదిలేశాడు. వరండాలో కొచ్చి చీరను చుట్టి యధాస్థానంలోకి తోసేశాడు. చీర అమ్మ వాసనకొట్టింది.

"గోవిందూ వున్నావా?"

"ఉన్నా...."

"ఏం చేస్తున్నావ్?"

"ఏం చెయ్యడంలేదు."

ఆ గొంతు బొంగురుగా ధ్వనించింది. అలాంటి గొంతుకతో ఆ వ్యక్తి మాట్లాడటం ఎప్పుడూ వినివుండలేదు. తన "అన్యాయానికి' 'కి తానే గుండె బాదుకుని మేకుకు చుట్టుకుపోయింది క్యాలెండరు వెనక్కుతిరిగిపోయి మరీ. గోడలు పాడవుతాయని (అప్పటి కవి నిష్కళంకంగా వున్నట్లు), మేకులు కొట్టనిచ్చేదికాదు. అంతకుముందు, ఆమె ఆ ఇంట్లో అడుగుపెట్టకముందున్న వాటిని సిమెంటుతో తనే మూసేయడానికి ప్రయత్నం చేసింది. వరండాలోని మేకు మాత్రం పీకినా రాకుండా వుండిపోయింది. దానికి పది పదిహేను రోజులనాడు తగిలించిన క్యాలెండరు ఇన్నిరోజులుగా లబలబ మంటోంది. గోడను రాచి రంపాన పెడుతోంది - మేకుతో సంబంధాన్ని తెంచుకోటానికి, అర్థమనస్కంగా ప్రయత్నిస్తూ. అవకాశం దొరికినపుడూ ఒదిలిపోలేక కొట్టుమిట్టాడు తోంది. మరోసారి పడవలను వదిలివచ్చి స్టూలెక్కి క్యాలెండరును తొలిగించి చుట్టచుట్టి మూలపడేశాడు.

ధైర్యవంతుడే కుర్రాడు అని మెచ్చుకున్నారు బంధువులు. వాళ్ళల్లో ఒకరిద్దరు "ధైర్యానికే ముంది, చిన్నవయసు......ఊహ తెలియని వయసు....' 'అన్నారు సమాధానంగా. ఏ వేళలా మరొకరిని మెచ్చుకోడం మానవనైజానికే విరుద్ధం అని గాఢంగా నమ్మిచరించేవాళ్ళు.

మంచం మళ్ళీ లాగిన శబ్దం. పై కప్పు జల్లెడగదా.

వర్షానికి వేసి వుంచిన పగ్గాలు సడులుతున్నాయి.

"తడుస్తున్నావెందుకూ, జబ్బుచేస్తుంది లోపలికిరా" అని మందలింపుకేక వినపడితే బాగుండు. గతంలో లోపలికి వెళ్ళటానికి మొరాయించి వుండేవాడు. ముఖ్యకారణం తేలేకాగితం పడవలను వదలలేక పోవటం.

ఈ క్షణాన ఎవరి ఆంక్షలూ, అజమాయిషీలూలేని స్వేచ్ఛ ఆనందం ఇవ్వటంలేదు. నిజానికి, ఇది స్వేచ్ఛ అనిగాని దాని స్వభావం ఇదనిగాని తెలియని వయసు. ఇష్టాయిష్టాలకు మాత్రం వయసు ప్రమేయం లేదుగదా.

వర్షపు జోరు దాని నీడలాంటి హోరు వున్నట్లుండి ఎక్కువయ్యాయి. ఏడ్చిఏడ్చి బాధతీరక ,ఏడ్చినా బాధతీరదని చివరకు తెలుసుకుని, తీరని బాధను ఎలా తీర్చుకోవాలో తెలీక ఏడుస్తున్నట్లు, ముందుకన్నా పై స్థాయిలో.

ఉన్నట్లుండి చెప్పీచేయకుండా చావులా ముంచుకొచ్చిన వర్షానికి పడవనిండి పొయ్యింది. పైనించి పడే వర్షపు చినుకులకు పడవ ఈ క్షణాన కాకపోతే మరోక్షణంలో పూర్తిగా తడిసీపోక తప్పదు. కుక్కల గుంటలోని నీటిలో మునకవేయక తప్పదని ఆ వయసువాడికీ తెలుసు. అయితే తీరా అది జరిగినపుడు భరించటమే కష్టం.

ఆ పడవ నీకూ నాకూ విలువైంది కాకపోవచ్చు. ఒకడికి విలువైనది మరొకడికి కాకపోవచ్చు. ఒకడికి కానిది ఇంకొకడికి కావచ్చు.

దుఃఖమూ ముంచుకొచ్చింది, చెప్పీపెట్టకుండా. దుఃఖానికి అలాంటి మర్యాదేదో వున్నట్లు!

'ఇది ప్రాణం లేనిది, పరస్పర అనుబంధం పెంచుకోటానికి అవకాశం లేనిది, మరొక పడవ ద్వారా ఈ నష్టాన్ని తేలిగ్గా పూడ్చుకోవచ్చు' అన్న తర్కం తెలిపే /తెలిసే వయసు కాదు.

ఏమో! అన్నీ తెలిసీ, అది ఒక మిషగా 'ఇదీ' అని తెలీని కారణంగా ముంచుకొచ్చిన దుఃఖం కావచ్చు.

ఏది ఏమైనా కట్టలు తెంచుకుని ముప్పులా వచ్చిందది. గుండెబద్దలవ్వాల్సిన వేళ కూడా చేయని పని ఇప్పుడు చేస్తున్నాడు. ఇంతకుముందు కోల్పోయిన దానికన్నా దీన్ని కోల్పోవటం ఎక్కువ బాధ కలిగించా? ఏమో. కావచ్చు, కాకపోవచ్చు!

ఈ విధంగానైనా స్వేచ్ఛను కోల్పోవటానికేమో? ఏమో. కావచ్చు.....!

ఇంతవరకూ, ఏకాంతం దొరికిన క్షణం మొదలూ, ఇంట్లో మంచంలో పొర్లిపొర్లి ఏడ్చిన మనిషి అది కాస్సేపు ఆపుకుని బయిటికి వచ్చాడు. గోవిందు పడవవైపు చూపించాడు. అతను వాడిని ఖాళీ ఇంట్లోకి లాక్కు పొయ్యాడు.

తండ్రీకొడుకులు ఒకరినొకరు కౌగిలించుకుని ఏడుస్తున్నారు.

★